బలగం
BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 30 జూలై 2025 | www.balagamtv.com | పేజీలు 4

## రేపు భారీ జాబ్ మేళా

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఈ నెల 31వ తేదీన భారీ జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో రిటైల్ ఇండస్ట్రీలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు బీఆర్ఏఓయూ అధికారులు తెలిపారు. ఈ జాబ్ మేళాను ఆర్ఏఎస్‌సీఐ స్టైపెండ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం కింద నిర్వహిస్తున్నారు. ఇందులో ఎంపికయ్యే విద్యార్థులకు నెలకు కనీసం రూ.7,000 నుంచి గరిష్టంగా రూ.24,000 వరకు స్టైఫండ్ రూపంలో జీతం లభించనుంది.

బీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులతో పాటు రెండవ, మూడవ సంవత్సరాల్లో చదువుతున్నవారు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు. అర్హత కలిగిన అభ్యర్థుల వయస్సు 27 సంవత్సరాల లోపు ఉండాలి. ఆసక్తి గల అభ్యర్థులు బీఆర్ఏఓయూ అధికారిక వెబ్‌సైట్ www.braou.ac.in ద్వారా ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అలాగే నేరుగా వాక్-ఇన్ విధానంలో కూడా హాజరయ్యే వీలున్నది. ఈ జాబ్ మేళా హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 46లోని బీఆర్ఏఓయూ అకడమిక్ బిల్డింగ్‌లో నిర్వహించనున్నారు. విద్యార్థులకు డిగ్రీతోపాటు ఉద్యోగ అనుభవం సంపాదించుకునే అవకాశం కల్పించే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

## యుద్ధం ఆపమని
# ఏ దేశాధినేత కోరలేదు

- ప్రధాని మోదీ
- పహల్గాం, ఆపరేషన్ సిందూర్‌పై ఉభయసభల్లో చర్చ
- పలు అంశాలపై కేంద్రాన్ని నిలదీసిన ప్రతిపక్షాలు
- బదులిచ్చిన కేంద్ర ప్రభుత్వం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

లోక్‌సభలో 'ఆపరేషన్ సిందూర్'పై మంగళవారం రెండో రోజు కూడా చర్చలు వేడెక్కాయి. ఈ సందర్భంగా ప్రతిపక్షాల ఆరోపణలకు కేంద్ర ప్రభుత్వం కఠినంగా బదులిచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. కాల్పుల విరమణ కోసం పాకిస్థానే వేడుకుంది తప్ప, ప్రపంచంలోని ఏ దేశాధినేతనూ భారత్‌ను ఆపమని కోరలేదని స్పష్టం చేశారు. "మేము చేపట్టిన ఆపరేషన్ నాన్‌ఎస్కలేటరీ" అని మోదీ పేర్కొన్నారు.

### "గోలికి గోలే సమాధానం ఇచ్చాం"

మే 6-7 మధ్య రాత్రి భారత్ పాక్‌పై చేసిన ప్రతీకార దాడిలో 22 నిమిషాల్లోనే అపూర్వ విజయాన్ని సాధించామని మోదీ వెల్లడించారు. మే 9 రాత్రి అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తనతో మాట్లాడేందుకు అనేకసార్లు ఫోన్ చేశారని, అయితే తాను ఆ సమయంలో భద్రతాదళాలతో సమీక్షలో ఉండటంతో మాట్లాడలేకపోయానని తెలిపారు. అనంతరం ఆయన ఫోన్ చేసేసరికి.. పాక్ భారీ దాడికి సిద్ధమవుతోందని హెచ్చరించారని, అయితే తాను "గోలికి గోలే సమాధానం ఇస్తాం" అని స్పష్టం చేశానన్నారు.

"భారత దళాల దాడుల తట్టుకోలేక పాకిస్థాన్ వణికిపోయింది. 'బస్ కరో.. బహుత్ మారా హై' అంటూ మన డీజీఎంఓను వేడుకుంది," అని మోదీ గుర్తు చేశారు. ఇదే సమయంలో ప్రపంచ దేశాలు భారత్‌కు మద్దతుగా నిలిచాయని, 193 దేశాల్లో కేవలం మూడు దేశాలు మాత్రమే పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచాయని తెలిపారు.

### "పీఓకే కోల్పోయింది కాంగ్రెస్ వల్లే"

ఈ సందర్భంగా మోదీ కాంగ్రెస్‌ను తీవ్రంగా విమర్శించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్ కోల్పోవడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమేనని, పీఓకేతో పాటు సింధు జలాల ఒప్పందం, నెహ్రూ పాలనలోనే పాక్‌కు డ్యాం నిర్మాణానికి నిధులు కూడా పంపించారని ఆరోపించారు. భవిష్యత్‌లో ఉగ్రవాద దాడులకు తగిన విధంగా సమాధానం ఇస్తామని, అణ్వాయుధ బెదిరింపులకు భారత్ భయపడదని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే ప్రభుత్వాన్ని, ఉగ్రవాదులను వేరుగా చూడబోమని మోదీ తేల్చి చెప్పారు.

ఆయుధపరంగా ఎంత పటిష్టంగా ఉన్నా శాంతి కోసమే ప్రయత్నిస్తామని మోదీ అన్నారు. భారత్ యుద్ధ దేశం కాదని బుద్ధ దేశమని చెప్పారు. పీవోకేను తిరిగి కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ సహా విపక్షాలు అడుగుతున్నాయని, ఎవరి కాలంలో పీవోకే పాకిస్థాన్ కబ్జాలోకి వెళ్లిపోయిందో అందరికీ తెలుసన్నారు. దేశ భద్రత విషయంలో కాంగ్రెస్ మొదట్నుంచీ ఉదాసీనంగా వ్యవహరించిందని దుయ్యబట్టారు. 1971లో పీవోకేను వెనక్కి తీసుకునే అవకాశం వచ్చినా ఉపయోగించుకోలేదని, వేలమంది పాకిస్థాన్ సైనికులు మనకు బందీగా చిక్కారని గుర్తు చేశారు. 1971లో మన సైన్యం పాక్ భూభాగంలో వేల కిలోమీటర్లు ముందుకెళ్లిందని, ముందుచూపుతో వ్యవహరించి ఉంటే పీవోకేను అప్పుడే తిరిగిపొందేవాళ్లమని తెలిపారు. పీవోకేను తిరిగిపొందే సువర్ణావకాశాన్ని కాంగ్రెస్ వృథా చేసిందని ఆరోపించారు. 1974లో కచ్చతీవ్ దీవులను శ్రీలంకకు అప్పగించారని విమర్శించారు.

### కాంగ్రెస్ విమర్శలు

మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మోదీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ట్రంప్ 29 సార్లు కాల్పుల విరమణకు తనదే పాత్ర అని చెప్పినప్పుడు మిగితా 2వ పేజీలో

## హైదరాబాద్‌ను
# కాలుష్య రహితంగా అభివృద్ధి చేద్దాం

- ఓఆర్ఆర్ వెలుపలకు కాలుష్యకారక పరిశ్రమలు
- మూసీ అభివృద్ధి పనుల్ని వేగవంతం చేయండి
- 'మెట్రో'రైల్ వేగంగా పూర్తికావాలి
- జూపార్క్ వద్ద పర్యాటకుల కోసం టవర్ల నిర్మాణం
- పురపాలకశాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు అవసరమైన సంస్కరణలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ కోర్ సిటీ ఏరియాలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలించాలని ముఖ్యమంత్రి చెప్పారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై ముఖ్యమంత్రి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. కాలుష్య రహితంగా మార్చే ప్రణాళికలతో పాటు పాతబస్తీ మెట్రో విస్తరణ పనులు, మూసీ రివర్ ఫ్రంట్, మిరాలం ట్యాంక్ ప్రాంతాన్ని పర్యాటక అభివృద్ధి వంటి అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించారు.

విపరీతమైన కాలుష్యంతో ఢిల్లీ, ముంబయి, చెన్నై వంటి నగరాల్లో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాంటి పరిస్థితి హైదరాబాద్ నగరంలో తలెత్తకూడదని అన్నారు. నగరాన్ని కాలుష్య రహితంగా మార్చడంతో పాటు 25 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి గారు సూచించారు. ఆ ప్రణాళికలు రూపొందించడంలో ఆయా మహానగరాల్లో ఎదురవుతున్న సమస్యలను అధ్యయనం చేయాలని పేర్కొన్నారు.

"నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ కేబులింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో అన్ని శాఖలు సమగ్ర డీపీఆర్‌లు తయారు చేయాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, నిర్మాణ రంగ వ్యర్థాలను సిటీలో ఎక్కడపడితే అక్కడ డంప్ చేయకుండా చూడాలని నిఘా పెట్టాలని చెప్పారు. ఉద్దేశపూర్వకంగా అలా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ నగరంలో మంచినీటి సరఫరా, మురుగు నీటి పారుదల వ్యవస్థను పూర్తిగా సంస్కరించాలి. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా హైదరాబాద్ నగర మంచినీటి సరఫరా, సీవరేజీ బోర్డు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. బోర్డు తమకున్న వనరులను ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలనే అంశంపై ప్రత్యేక ప్రణాళిక రూపొంచుకోవాలి.

ఓఆర్ఆర్ పరిధిలోని వారసత్వ కట్టడాల సంరక్షణ, వాటిని పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దేలా కులీకుతుబ్ షాహీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మార్గదర్శకాలను సవరించి దానిని మరింత బలోపేతం చేయాలి. పాతబస్తీలో మెట్రో పనులకు అవసరమైన నిధులు ఇప్పటికే విడుదల చేసినందున అక్కడ మెట్రో పనులు వేగవంతం చేయాలి. మెట్రో ఇతర ఫేజ్‌ల అనుమతులు, తదితర విషయాల్లో ఏమాత్రం జాప్యాన్ని సహించేది లేదు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖతో సమన్వయం చేసుకుంటూ త్వరగా పనులు పట్టాలెక్కేలా చూడాలి. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్ పేట ఓఆర్ఆర్ వరకు ఎలివేటేడ్ కారిడార్ పనులు వేగవంతం చేయాలి.." అని ముఖ్యమంత్రి చెప్పారు.

మూసీ రివర్ ఫ్రంట్‌కు సంబంధించి హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు పనులు వేగవంతం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. ఓఆర్ఆర్ నుంచి మూసీ వైపు వచ్చే క్రమంలో కొత్వాల్‌గూడ జంక్షన్‌లో మూసీ రివర్ ఫ్రంట్‌కు ప్రతీకగా ఇండియా గేట్, గేట్ వే ఆఫ్ ఇండియా, చార్మినార్ లాంటి ప్రత్యేకత కలిగిన ఒక ల్యాండ్ మార్క్‌ను నిర్మించాలని సూచించారు. మూసీపైన బ్రిడ్జి కం బ్యారేజీలకు ప్రణాళికలు రూపొందించాలి. నెహ్రూ జూ పార్క్, మీరాలం ట్యాంక్ అభివృద్ధి పనుల్లో పురోగతిపైనా ముఖ్యమంత్రి గారు సమీక్షించారు. జూ పార్క్, మీరాలం ట్యాంక్ సమీపంలో పర్యాటకులు బస చేసేందుకు వీలుగా అధునాతన వసతులతో టూరిజం ప్లాజా నిర్మించాలని అభిప్రాయపడ్డారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారితో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లు ఎత్తి నీటి విడుదల

- 'సాగర్ గేట్లను ఎత్తిన మంత్రులు
- 18 ఏండ్ల తర్వాత జులైలోనే నిండిన ప్రాజెక్టు
- 'ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించడమే కాంగ్రెస్ లక్ష్యం
- మంత్రులు ఉత్తమ్, అడ్లూరి లక్ష్మణ్ కుమాం


**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగుల సమీపానికి చేరుకోవడంతో మంగళవారం ఉదయం మంత్రులు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. పై నుంచి వరద ప్రవాహం పెరగడంతో సాయంత్రానికి అధికారులు పూర్తి గేట్లను ఎత్తారు. మొత్తం 26 గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ దిగువకు ప్రవహిస్తోంది. 18 ఏండ్ల తరువాత.. నెల ముందుగానే నాగార్జునసాగర్ నుంచి నీటిని విడుదల చేయడం ఇదే తొలిసారి. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు.

తెలంగాణలో ఎడతెరిపిలేని వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి భారీగా నీరు రావడం వల్ల నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండను తలపిస్తోంది. దీంతో మంగళవారం ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం సాగర్ జలాశయంలో నీటిమట్టం 586.60 అడుగులకు చేరుకుంది. ఇది పూర్తి సామర్థ్యం అయిన 590 అడుగులకు చేరువలో ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై దిగువ నది పరివాహక ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. "సాగర్ గేట్లు ఎత్తడం సంతోషదాయకం. ఇది కేవలం జలాశయం కాదు, మన ఆధునిక దేవాలయం. నెహ్రూ గారు పునాది వేయగా, ఇందిరాగాంధీ ప్రారంభించిన ప్రాజెక్ట్ ఇది," అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతోందని చెప్పారు. ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని మేజర్ ప్రాజెక్టులను ఆధునీకరిస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గత మిగితా 2వ పేజీలో

# 'బనకచర్ల'ను నిలువరించాల్సిందే



- 'రైతుల సంక్షేమం కోసం రాజీ లేని పోరాటానికి సిద్ధం కావాలి
- 'మాజీ సీఎం కేసీఆర్ పిలుపు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర రైతాంగ సంక్షేమాన్ని కాపాడటానికి, వ్యవసాయ రంగాన్ని నూతన సంక్షోభం నుంచి బయటపడేయడానికి బీఆర్ఎస్ మరింత ఉద్యమాలు చేపట్టాలని పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) పిలుపునిచ్చారు. ఏపీ ప్రభుత్వం చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణ సాగునీటి హక్కులు దెబ్బతినే ప్రమాదం ఉందని, ఈ ప్రాజెక్టును నిలిపివేయాల్సిందేనని ఆయన స్పష్టంచేశారు. ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో నిర్వహించిన కీలక సమీక్షలో కేసీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నాయకులు హరీష్‌రావు, జగదీశ్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ "రాష్ట్ర ప్రభుత్వం తమ పాలనా వైఫల్యాలను దాచిపెట్టేందుకు, ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు మద్ధతుగా వ్యవహరిస్తోంది. ఇది తీవ్రంగా ఖండించదగ్గ విషయం. తెలంగాణ రైతులు నమ్మిన పాపానికి ఇప్పుడు నీటి కొరతతో తల్లడిల్లుతున్నారు. వానాకాలం సాగు ఇప్పటికీ పూర్తి కాలేదు. కాళేశ్వరం జలాలను ఎత్తిపోకుండా చేతులు ముటకట్టుకుని కూర్చోవడం ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడానికే నిదర్శనం," అని తీవ్రంగా విమర్శించారు.

### యూరియా కొరతపై ఆగ్రహం

రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరత ఏర్పడి రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ అంశంపై కూడా కేసీఆర్ మండిపడ్డారు. "ఇది క్షమించలేని నేరం. యూరియా లేనిదే నాట్లు ఎలా సాగుతాయి? ఈ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేయాలి," అని అన్నారు. ప్రజల సమస్యలపై కేవలం విమర్శల పరస్పరాలకే పరిమితమైన కాంగ్రెస్, బీజేపీల తీరు ప్రజా వ్యతిరేకమని మండిపడ్డారు. "ఒకరిపై మరొకరు విమర్శలు చేస్తూ కాలయాపన చేస్తూ, ప్రజల సమస్యలను గాలికి వదిలేస్తున్నారు. వీరిని బీఆర్ఎస్ ప్రశ్నించాలి," అన్నారు. ప్రతి మండలంలో పార్టీ అనుబంధ విభాగాల్ని బలోపేతం చేసి ప్రజల్లోకి వెళ్లాలని, విద్యార్థి విభాగంతో సహా అన్ని వర్గాలను పోరాటానికి సిద్ధం చేయాలని సూచించారు.

కన్నేపల్లి పంప్ హౌస్ వద్ద గోదావరి నీటిని ఎత్తిపోసి చెరువులు, కుంటలు, రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి అవసరమైన సాగునీటిని వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ భేటీతో రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కొత్త ఉద్యమానికి తెరలేపినట్టయ్యిందని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి.



## ఓటర్లను తొలగించినట్టు తేలితే జోక్యం చేసుకుంటాం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

షెడ్యూలు ప్రకారం ఆగస్టు 1న ప్రచురించే ఓటర్ల జాబితా ముసాయిదాలో పెద్ద సంఖ్యలో ఓటర్లను తొలగించినట్లు తేలితే తక్షణమే తాము జోక్యం చేసుకుంటామని సుప్రీంకోర్టు మంగళవారం పేర్కొంది. ప్రతిపాదిత ముసాయిదాలో 65లక్షలమంది ఓటర్ల పేర్లను తొలగించారని, వీరిలో కొందరు చనిపోగా, మరికొందరు శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయారని చెబుతున్నారని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రైట్స్‌తో సహా పలు ఎన్‌జీఓలు, ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే ఆందోళన వెలిబుచ్చాయి. దానిపై స్పందిస్తూ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బగ్చిలతో కూడిన బెంచ్ పై ప్రకటన చేసింది. "ఎన్నికల కమిషన్ చనిపోయారని చెబుతున్న, కానీ జీవించి వున్న ఒక 15మందిని తీసుకురండి, మేం ఆ విషయాన్ని పరిశీలిస్తాం." అని జస్టిస్ బగ్చి పిటిషనర్ల తరపు న్యాయవాదులకు సూచించారు. అయినా ముసాయిదా ప్రచురితమయ్యేవరకు వేచిచూడాలని జస్టిస్ కాంత్ పిటిషనర్లకు సూచించారు. ఇప్పటికైతే వారి భయాందోళనలు అన్నీ ఊహాజనితాలే అని భావిస్తున్నట్టు వ్యాఖ్యానించారు. ఈ ఏడాది జనవరి 7వ తేదీన గల ఓటర్ల జాబితా ప్రాతిపదికన ముసాయిదా సిద్ధమవుతోందని బగ్చి చెప్పారు. ఈ జాబితాలో వున్నవారందరూ ముసాయిదాలో వుంటారని ఈసీ ఇప్పటికే సుప్రీం కోర్టుకు అందచేసిన తన అఫిడవిట్‌లో పేర్కొంది. అందువల్ల జనవరి 2025 అనేది ప్రారంభ సూచి. మీరు చెబుతున్న 65లక్షల మంది ఓటర్లు ఆ జాబితాలో వుండి ముసాయిదాలో వుండరన్నది మీ భయంగా వుంది. అయితే ఒకవేళ ముసాయిదాలో తమపేరు లేకపోతే దిద్దుబాట్ల కోసం మళ్ళీ దరఖాస్తు చేసుకోవడానికి ఈసీ షెడ్యూల్ ఇచ్చిందని జస్టిస్ బగ్చి గుర్తు చేశారు. ఈసి తరపున సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది మాట్లాడుతూ, ముసాయిదాలో పేరు లేనివారు నెల రోజుల్లోగా అంటే సెప్టెంబరు 1లోగా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చునని, సెప్టెంబరు 30న తుది జాబితా ప్రచురిస్తారని తెలిపారు.

# మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- 'బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- 'సిరిసిల్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో వరుసగా సమావేశాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



సిరిసిల్ల నియోజకవర్గంలోని తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, బోయినపల్లి మండలాల్లోని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో వరుసగా సమావేశాలు నిర్వహించిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను తీవ్రంగా ఎండగట్టారు. గత 20 నెలలుగా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఆయన విమర్శించారు. అధికారంలోకి రాకముందు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ విస్మరించి, అవినీతి అరాచకాలకు తెరలేపిందని ఆయన ఆరోపించారు.

ఓటర్లను ఆకర్షించేందుకు పెద్ద ఎత్తున హామీలు ఇచ్చిన కాంగ్రెస్, ఒక్క హామీని కూడా అమలు చేయని ప్రభుత్వంగా, నిట్ట నిలువునా అందర్నీ ముంచిన ప్రభుత్వం కాంగ్రెస్ అని అన్నారు. రైతులకు, నిరుద్యోగులకు, వృద్ధులకు, మహిళలకు ఇచ్చిన అన్ని హామీలను విస్మరించి, ఉత్త మాటలతో కాలం గడుపుతోందని విమర్శించారు. కేవలం ఓట్ల సమయంలోనే రైతుబంధు ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. వ్యవసాయం బాగుపడాలంటే మళ్లీ కేసీఆర్ రావాలన్నది ఇప్పుడు రైతుల అభిప్రాయం. అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర యువతను విద్యార్థులను తీవ్రంగా మోసం చేసింది. ఆడపిల్లలకు స్కూటీలు, నిరుద్యోగులకు భరోసా ఇవ్వకుండా మోసం చేసింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరు చెప్పి మిగిలిన హామీలన్నింటినీ ఎత్తగొట్టింది" అంటూ ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం పైన విమర్శల దాడి చేశారు.

ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రజలందరిలో కాంగ్రెస్ ప్రభుత్వంపై కోపం పెరిగిపోయిందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు గట్టి బుద్ధి చెబుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలతో పాటు బీసీలను కూడా మోసం చేసింది. బీసీ రిజర్వేషన్ల పేరుతో జరుగుతున్న మోసాన్ని బీసీలకు వివరించాలి. ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి గడపకి తీసుకెళ్లాలి అని పార్టీ కార్యకర్తలకు సూచించారు.

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో అనేక సమస్యలు ఎదురవుతున్నా ప్రభుత్వం

# బీసీల కోసం మరోసారి 72 గంటల నిరాహార దీక్ష

- ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మరోసారి పోరుబాట పట్టారు. ఆగస్టు 4వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 7వ తేదీ ఉదయం 11 గంటల వరకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో 72 గంటల నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో యునైటెడ్ ఫూలే ఫ్రంట్, బీసీ సంఘాల నేతలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రకటించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు ఇప్పటికే 42 శాతం రిజర్వేషన్లు కల్పించామని గుర్తుచేసిన కవిత, అదేలా విద్య, ఉద్యోగాల్లో కూడా 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకే ఈ దీక్ష చేపడుతున్నట్టు తెలిపారు. "గతంలో అంబేద్కర్ విగ్రహ సాధన కోసం కూడా ఇదే తరహా 72 గంటల దీక్ష చేశాను. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చింది. ఇప్పుడు బీసీల హక్కుల కోసం అదే మాదిరిగా దీక్ష చేస్తాను," అని పేర్కొన్నారు. దీక్షకు ప్రభుత్వ అనుమతి కోరామని, అనుమతి ఇవ్వకపోతే ఎక్కడ ఉన్నా అక్కడే దీక్ష మొదలెడతానని స్పష్టం చేశారు. బీసీల కోసం పోరాడిన ఫూలే, అంబేద్కర్ ఆవేశాన్ని తన పోరాటంలో చూపుతానని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ, మండలిలో బీసీల కోసం రెండు వేర్వేరు బిల్లులు ఆమోదించిందని గుర్తుచేశారు. అయితే మిగితా 2వ పేజీలో



## రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు పేదలకు చేరవే లక్ష్యం

- మంత్రి గడ్డం వివేక్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తుందని కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంగళవారం సిద్ధిపేట పట్టణంలోని కొండా మల్లయ్య గార్డెన్స్ లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. జిల్లాలో కొత్త, పాత కార్డుల కలిపి 52 వేల మందికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. గత ప్రభుత్వంలో పంపిన 'దొడ్డు బియ్యం'ను లబ్ధిదారులు వాడలేకపోయారని.. ఇప్పుడు పౌష్టికాహారాన్ని ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో మిగితా 2వ పేజీలో

# బీసీలకు 42% రిజర్వేషన్ల కోసం బీఆర్ఎస్ బహిరంగసభ

- **కరీంనగర్‌లో ఆగస్టు 8న బీసీ గర్జన**
- **మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ భారీ బహిరంగసభ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ఆగస్టు 8వ తేదీన కరీంనగర్ జిల్లాలో బీసీల గర్జన సభను ఏర్పాటు చేస్తున్నట్టు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో జరిగిన బీసీ నేతల సమావేశంలో తలసాని అధ్యక్షతన కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సభ ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేయనుంది. ఈ సమావేశంలో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనచారి, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాస్ గౌడ్, స్వామి గౌడ్, ముఠా గోపాల్, రమణ తదితరులు పాల్గొన్నారు.




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మభ్యపెడుతోందని తలసాని విమర్శించారు. పారదర్శకత లేకుండా కులగణన చేపట్టి అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టారని, రాష్ట్రపతికి ఆమోదం లభించకముందే ఆర్డినెన్స్ తెస్తామనడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన తెలిపారు. అసెంబ్లీలో బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చితేనే చట్టబద్ధత కలుగుతుందన్న విషయాన్ని బీఆర్ఎస్ స్పష్టంగా తెలిపిందని పేర్కొన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్నట్లుగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. లేదంటే బీసీలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

శాసనమండలిలో బీసీ బిల్లుకు తాము మద్దతిచ్చామని, అయినప్పటికీ ప్రభుత్వం అమలులో నిర్లక్ష్యం చేస్తోందని మధుసూదనచారి ఆరోపించారు. "కాంగ్రెస్ మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయి" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ బీసీల పట్ల నిజమైన చిత్తశుద్ధితో ఉంటే అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు."బీసీలకు సీఎం అవకాశం వచ్చినా కాంగ్రెస్ ఇవ్వలేదు. బీసీలను మోసం చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పనిచేస్తోంది. బీసీలకు రక్షణ కవచంగా బీఆర్ఎస్ నిలుస్తుంది" అని గంగుల కమలాకర్ తెలిపారు. కాంగ్రెస్ కుటిలత్వాన్ని ప్రజల్లో ఎండగడతామని, బీసీల హక్కుల కోసం రాజ్యపతి దాకా పోరాడతామని బీఆర్ఎస్ బీసీ నేతలు స్పష్టం చేశారు.

# యుద్ధం ఆపమని ఏ దేశాధినేత కోరలేదు

(మొదటి పేజీ తరువాయి)

మోదీ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. మోదీకి అర్థం అయినంత ధైర్యం ఉంటే పార్లమెంట్ వేదికపై "ట్రంప్ అబద్ధం చెప్పాడు" అని ధైర్యంగా చెప్పాలని రాహుల్ గాంధీ సవాల్ విసిరారు.

పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విషయంలో కేంద్ర ప్రభుత్వం సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వలేదని లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రధానమంత్రి మోదీ తన వ్యక్తిగత ఇమేజ్ కోసం సైన్యాన్ని వినియోగించుకుంటున్నారని విమర్శించారు. "ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైన 30 నిమిషాల్లోనే పాకిస్థాన్‌తో భారత్ డీజీఎంవో స్థాయిలో మాట్లాడడం, తాము ఉద్రిక్తతలు కోరుకోవడం లేదని తెలియజేయడం అనేది కేంద్ర ప్రభుత్వం యుద్ధానికి వెనకడుగు వేసిన చాటుబల్లగా భావించాలి. మోదీకి ఇందిరాగాంధీ ధైర్యం ఉంటే, డొనాల్డ్ ట్రంప్ అబద్ధాలు చెబుతున్నాడని సభలో స్వయంగా ప్రకటించాలి," అని సవాల్ విసిరారు.

"ఆపరేషన్ సిందూర్ 22 నిమిషాల్లో పూర్తయ్యిందని రక్షణ మంత్రి తెలిపారు. పాకిస్థాన్ సైనిక స్థావరాలపై దాడి చేయలేదని ప్రభుత్వమే ప్రకటించింది. ఉగ్రస్థావరాలపైనే దాడులు జరిగాయని చెప్పినందుకు అర్థం ఏమిటంటే... ప్రభుత్వానికి పాక్‌పై పోరాట సంకల్పం లేదన్నది స్పష్టమవుతుంది," అని రాహుల్ అన్నారు."పహల్గాం ఉగ్రదాడిలో అమాయకులు, చిన్నపిల్లలు, వృద్ధులు మరణించడం బాధాకరం. ఈ దాడిని దేశం మొత్తమూ ఖండించింది. ఆపరేషన్ సిందూర్‌కు ముందు అన్ని పార్టీలు ఏకతాటిపై నిలబడ్డాయి. సైనికులు గొప్ప ధైర్యసాహసాలు ప్రదర్శించారు. కానీ కేంద్రం వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వలేదు. 1971లో ఇందిరాగాంధీ పాక్‌పై యుద్ధానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. లక్ష మంది పాక్ సైనికులను బందీలుగా తీసుకున్నాం. అదే ధైర్యం ఇప్పుడు కనిపించడం లేదు," అంటూ వ్యాఖ్యానించారు. "దాడిలో భారత యుద్ధ విమానాలను కోల్పోయిన విషయం నిజమేనని ఎయిర్‌ఫోర్స్ అధికారులు చెబుతున్నారు. ఈ నష్టానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి. మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం ఈ ఆపరేషన్‌ను రాజకీయ లబ్ధి కోసం వినియోగించుకుంది," అని ఆరోపించారు. "దేశ ప్రయోజనాల కోసం సైన్యాన్ని వినియోగించాలి కానీ వ్యక్తిగత ప్రచారం కోసం కాదు. ప్రధాని మోదీకి ఇందిరాగాంధీ ధైర్యం ఉన్నా ఈ విషయాలను పార్లమెంటులో ఖండన చేయాలి," అని రాహుల్ గాంధీ ఢీకొట్టారు.

పహల్గాం ఉగ్రదాడి అంశంపై రాజ్యసభలో తీవ్రంగా స్పందించిన ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. భద్రతా విఫలతలను ధ్వజమెత్తిన ఖర్గే, అమిత్ షాను కాపాడేందుకే జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ద్వారా ప్రకటన చేయించారా అని తీవ్రంగా ప్రశ్నించారు. పహల్గాం దాడికి మూడురోజుల ముందు ప్రధాని మోదీ జమ్మూకశ్మీర్ పర్యటనను రద్దు చేసుకున్నారని గుర్తుచేస్తూ..."అది యాదృచ్ఛికమా? లేక ముందే సమాచారం ఉండి రద్దు చేసుకున్నారా? ప్రధాని వద్దకు వెళ్లకండి అని ప్రజలకు హెచ్చరించాల్సింది హోంమంత్రి కాదు?" అని ప్రశ్నించారు ఖర్గే.

"ప్రభుత్వ పెద్దల ప్రాణాలు రక్షించుకోవడానికి ప్రజల ప్రాణాలు త్యాగం చేయాలా?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాక్ మద్దతు అంటూ అసత్య ఆరోపణలు మానండి ప్రతిపక్షాలపై పాకిస్థాన్ మద్దతు ఇస్తున్నారని ముద్ర వేయడాన్ని ఖండించిన ఖర్గే, "కాంగ్రెస్ దేశాన్ని నిర్మించిన పార్టీ. మేం ఎప్పుడూ పాక్‌కు మద్దతు ఇవ్వలేదు. బీజేపీ హయాంలోనే ఉగ్రవాదం మూడింతలు పెరిగింది. నిజాల్ని వినిపించకుండా ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు" అని ధ్వజమెత్తారు. "ఒక యుద్ధ విమానం కూడా కోలుపోలేదని నిరూపించలేరు. సైన్యం ధైర్యంగా పోరాడింది. మేము సైన్యం వెనుక ఉన్నాం. కానీ మీరు రాజకీయ లబ్ధికోసం సైన్యాన్ని వినియోగించుకుంటున్నారు" అని మండిపడ్డారు.

ఆపరేషన్ సిందూర్‌ను తాత్కాలికంగా నిలిపివేశామని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. దాయాది దేశం మళ్లీ దుస్సాహసానికి ఒడిగడితే ఆపరేషన్ సిందూర్‌ను మళ్లీ ప్రారంభించేందుకు వెనుకాడమని తేల్చిచెప్పారు. ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించమని చెప్పారు. రాజ్యసభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చను ప్రారంభించిన రక్షణమంత్రి దేశ భద్రత విషయంలో విపక్షాలు కూడా బాధ్యతగా ప్రవర్తించాలని సూచించారు. దేశ భద్రత విషయంలో మన వ్యాఖ్యలను ప్రజలు గమనిస్తున్నారని విపక్షాలను ఉద్దేశించి రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. 1962, 71 యుద్ధాల్లో విపక్షంలో ఉన్నప్పుడు తాము నిర్మాణాత్మక పాత్ర పోషించామని చెప్పారు. సైన్యానికి జరిగిన ఆస్తినష్టంపై తాము ఆనాడు ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదని గుర్తుచేశారు. తమది కూడా భారత్ అని పీవోకేలోని ప్రజలు పలికే రోజు తప్పక వస్తుందన్నారు. భారత్ వద్ద ఐఎన్ఎఫ్ విక్రాంత్ వంటి ఎయిర్‌క్రాఫ్ట్‌లున్నాయి. భారత రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు 2014 కంటే 35 రెట్లు పెరిగాయి. 2014లో రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు రూ.686 కోట్లుగా ఉండగా 2024 నాటికి రూ.24 వేల కోట్లకు పైగా రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు. వంద దేశాలకు పైగా రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు జరుగుతున్నాయి. 2029 నాటికి రూ.50 వేల కోట్ల రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు లక్ష్యం. రక్షణ ఉత్పత్తుల ఎగుమతుల్లో 10 అగ్ర దేశాల సరసన నిలిచాం. భారత్ ఆత్మనిర్భర్ లక్ష్యం సాధిస్తుందని పూర్తి నమ్మకం ఉంది. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌కు మద్దతిచ్చే దేశాలకు సందేశం ఇచ్చాం. పాక్ సైనికులు యుద్ధ మైదానంలో భారత్‌పై గెలవలేరు

"మే 10న భారత వాయుసేన పాకిస్థాన్‌కు చెందిన పలు వాయు స్థావరాలపై దాడులు చేసింది. దీంతో పాకిస్థాన్ కాళ్లబేరానికి వచ్చింది. దాడులను ఆపాలని పాక్? డీజీఎంవో ఛానల్ ద్వారా వేడుకుంది. దాయాది దేశం విజ్ఞప్తి చేయడంతోనే దాడులను ఆపి ఆపరేషన్ సిందూర్‌ను తాత్కాలికంగా నిలిపివేశాం" అని రాజ్‌నాథ్ అన్నారు.

# ప్రతి వీడియోను ఫార్వార్డ్ చేయవద్దు

**తెలంగాణ పోలీసుల హెచ్చరిక**

**బలగం టీవి, హైదరాబాద్**




సామాజిక మాధ్యమాలలో కనిపించే ప్రతి వీడియోను గుడ్డిగా ఫార్వార్డ్ చేయవద్దని తెలంగాణ పోలీసులు హెచ్చరిక జారీ చేశారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో మార్ఫింగ్ వీడియోలు అధికంగా వైరల్ అవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. "సోషల్ మీడియాలో కనిపించే ప్రతి వీడియో నిజమయ్యే అవసరం లేదు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ప్రముఖుల వీడియోలను మార్ఫ్ చేసి, పెట్టుబడులు పెట్టమని కోరుతూ మోసాలకు పాల్పడుతున్నారు. కొన్ని కంపెనీల ప్రచారం చేస్తున్నట్లు నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. అలాంటి వీడియోలను గుడ్డిగా ఫార్వార్డ్ చేయొద్దు," అని పోలీసులు స్పష్టం చేశారు.

ప్రముఖుల ముఖాలను ఉపయోగించి డీప్ ఫేక్ టెక్నాలజీ ద్వారా తయారు చేసే వీడియోలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రమాదం ఉందని, ఇవి విద్వేషాలను రెచ్చగొట్టేలా కూడా మారుస్తారని అధికారులు హెచ్చరించారు. వాస్తవాలను తెలుసుకోకుండా వీడియోలను షేర్ చేయవద్దని, తప్పుడు ప్రచారాలను ప్రోత్సహించకూడదని పోలీసులు విజ్ఞప్తి చేశారు. నకిలీ వీడియోలు మీ దృష్టికి వస్తే వెంటనే వాటిని సంబంధిత మాధ్యమాల్లో రిపోర్ట్ చేయాలని సూచించారు.

# నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లు ఎత్తి నీటి విడుదల

(మొదటి పేజీ తరువాయి)

వానాకాలం, యాసంగి, ప్రస్తుత వానాకాలం పంటకు సాగునీరు విడుదల చేయడం.. దానికి తగినట్టుగా సాగర్ జలాశయం పూర్తి స్థాయికి చేరుకోవడం సంతోషకరమైన విషయమన్నారు. నిర్దిష్ట షెడ్యూల్‌కి ముందే సాగర్ ఎడమ కాలువకు సాగునీరు విడుదల చేశామన్నారు. ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా విడుదలవుతున్న నీటితోపాటు అదనంగా మరో మూడు వేల క్యూసెక్కుల నీటిని ఎడమ కాలువ ఆయకట్టుకు విడుదల చేస్తున్నామన్నారు. 18 ఏండ్ల తర్వాత తొలిసారి జులై నెలలోనే నాగార్జునసాగర్ జలాశయం పూర్తిగా నిండటం.. గేట్లను ఎత్తడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కుందూరు జయవీర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రాష్ట్ర పౌరసరఫరాల ప్రిన్సిపల్ సెక్రెటరీ డీఎస్ చౌహాన్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్రపవార్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్ అజయ్ కుమార్, సాగర్ ప్రాజెక్టు ఎస్ఈ మల్లికార్జునరావు, ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఇక శ్రీశైలం జలాశయానికి కూడా భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. జూరాల, సుంకేశుల ప్రాజెక్టుల నుంచి 2,29,743 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, ఔట్‌ఫ్లో 2,48,900 క్యూసెక్కులుగా ఉంది. దీనిలో 1,62,942 క్యూసెక్కుల నీటిని ఆరు స్పిల్ వే గేట్ల ద్వారా సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

# బీసీల కోసం మరోసారి 72 గంటల నిరాహార దీక్ష

- **ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

(మొదటి పేజీ తరువాయి)

ఆ బిల్లుల అమలులో గ్యాప్ రావడాన్ని ప్రశ్నించారు. కేంద్రానికి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని అప్పట్లో ప్రభుత్వం చెప్పినా ఇప్పటికీ ఆ కసరత్తు జరగలేదన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన ధర్నాను ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా పట్టించుకోలేదని చెప్పారు.

"ఇప్పుడు ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లకుండా కేవలం పార్టీ పేరుతో ధర్నా చేస్తామంటూ బీసీలను మోసం చేస్తున్నారు," అంటూ కాంగ్రెస్ నేతలపై విమర్శలు గుప్పించారు. బిల్లులపై రాష్ట్రపతి ఆమోదం రాకపోతే, గవర్నర్ ఆమోదించకపోతే న్యాయపోరాటం ఎందుకు చేయలేదని ప్రశ్నించిన కవిత, తమిళనాడు ప్రభుత్వం 9 ఏళ్లపాటు న్యాయపోరాటం చేసి రిజర్వేషన్లు సాధించిందని గుర్తు చేశారు. "బీసీలకు అవకాశాలు ఉన్నా, కేంద్రంపై ఒత్తిడి చేయకుండా రేవంత్ రెడ్డి తన 'బడే భాయ్' నరేంద్ర మోదీని కాపాడడానికే శ్రమిస్తున్నారు" అంటూ కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# పేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందించడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకానికి రూ.9 వేల కోట్లను ఖర్చు చేస్తున్నామని మంత్రి వివరించారు. కేవలం బియ్యం మాత్రమే కాదు.. రేషన్ కార్డు ద్వారా రూ.200కే ఫ్రీ కరెంట్, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇండ్లు, ఇతర సంక్షేమ పథకాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు.పేదల గృహ కలను నెరవేర్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పురోగమిస్తోంది. సిద్దిపేట నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు, జిల్లాకు మొత్తం 10 వేల ఇండ్లకు పైగా మంజూరు చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 17 లక్షల ఇండ్లు నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్టు వెల్లడించారు. "పేదల ఆకాంక్షల్ని గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి అందరికీ ఇళ్లు ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నారు. నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా సూచించారు," అని వివేక్ తెలిపారు.

**హైదరాబాద్‌లోని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ వద్ద మంగళవారం నాడు సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి ఆధ్వర్యంలో తీవ్ర నిరసన తెలిపారు. తెలుగు సినీ పరిశ్రమలో తెలంగాణ నటీనటులు, కళాకారుల పట్ల వివక్ష చూపుతున్నారని వారు ఆరోపించారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ మరియు తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్‌లో తెలంగాణ సినీ కళాకారుల ఫోటోలు లేకపోవడం ఈ నిరసనకు ప్రధాన కారణం. ముఖ్యంగా, సి.నారాయణరెడ్డి ఫోటో ఎందుకు లేదని, పైడి జయరాజ్ ఫోటోను చిన్నదిగా చేసి హీరోయిన్ ఫోటో కింద పెట్టడం అవమానకరమని నిరసనకారులు ప్రశ్నించారు. నిరసన సమయంలో, తెలంగాణ కార్యకర్తలు "ఆంధ్ర గో బ్యాక్", "జై తెలంగాణ" వంటి నినాదాలు చేశారు.**

బలగం టీవి, హైదరాబాద్



## గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం..

- గంజాయి కేసులలో నిందుతులుగా ఉన్నవారిపై పటిష్ట నిఘా..
- గంజాయి కేసుల చేధనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందికి ప్రోత్సాహకాలు, ప్రశంస పత్రాలు..
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆరు నెలల వ్యవధిలో 37 కేసులలో 95 మంది అరెస్ట్, 3.500 గ్రాముల గంజాయి,12 గంజాయి చెట్లు స్వాధీనం..
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, గంజాయి కేసులల్లో నిందుతులుగా ఉన్నవారిపై నిఘా కఠినతరం చేసి గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సిబ్బందికి జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే సూచించారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో గంజాయి కేసుల చేధనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీస్ సిబ్బందికి ప్రోత్సాహకాలు,ప్రసంశ పత్రాలు అందించి జిల్లా ఎస్పీ అభినందించారు.

అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకోవడం జరుగుతుందని, గంజాయి నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని, గంజాయి కొన్న, సేవించిన, రవాణా చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి జిల్లాలో స్పెషల్ డ్రైవ్ లు, నార్కోటిక్ జగిలాలతో తనిఖీలు చేపడుతూ అక్రమ గంజాయి రవాణాపై, గంజాయి కేసులల్లో నిందుతులుగా ఉన్న వారిపై జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి ఉక్కుపాదం మోపుతున్నారన్నారు.,గడిచిన ఆరు నెలల్లో జిల్లాలో 37 కేసులలో 95 మందిని అరెస్ట్ చేసి 3.500 గ్రాముల గంజాయి, 12 గంజాయి చెట్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో గంజాయికి సంబంధించిన సమాచారం సబంధిత పోలీస్ వారికి అందించి గంజాయి రహిత జిల్లాగా మర్చడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు.

## 40 శాతం డైట్, 200 శాతం కాస్మోటిక్స్ చార్జీల పెంపు

- పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం..
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**బలగం టీవీ, వేములవాడ:**

పేద విద్యార్థులకు మెరుగైన విద్య, అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతా లక్ష్యంగా పని చేస్తున్నామని, రెసిడెన్షియల్ విద్యార్థులు చదువుకునే పేద పిల్లల కోసం ప్రజా ప్రభుత్వం 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీల పెంచామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.మంగళవారం వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో పిఎం ఉషా పథకం క్రింద 9 కోట్ల 20 లక్షల నిధులతో మహిళా వసతి గృహము హాస్టల్ భవనం నిర్మాణం కి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, శాసనసభ్యుడిగా ఎన్నికైన తర్వాత తొలిసారి అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పర్యటించిన సందర్భంగా బాలికలు హాస్టల్ వసతి లేక పడుతున్న ఇబ్బందులను గమనించి సీఎం దృష్టికి తీసుకుని వెళ్ళానని అన్నారు. విద్య పట్ల ప్రభుత్వానికి ఉన్న ప్రాముఖ్యత, పేదలు చదువుకునే పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత కల్పిస్తూ పనిచేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం హాస్టల్ నిర్మాణానికి 10 కోట్లు మంజూరు చేసిందని అన్నారు. 2005 సంవత్సరంలో అగ్రహారం డిగ్రీ కళాశాలలో సైన్స్ వింగ్ ఏర్పాటు కోసం అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సహకారంతో ఏర్పాటు చేశామని, హాస్టల్ వసతి కారణంగా ఎక్కువమంది బాలికలు ఉన్నత చదువులు చదువుకుంటారని అన్నారు.

పేద పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని లక్ష్యంతో కామన్ డైట్ మేన్యూ ప్రవేశ పెట్టామని అన్నారు. నూతనంగా 11 వేల టీచర్ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేసి ప్రభుత్వ పాఠశాలలో నియమించామని అన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన బదిలీలు పదోన్నతులు పారదర్శకంగా చేశామని అన్నారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకుని వస్తున్నామని, ఐటిఐ కళాశాలను రతన్ టాటా కంపెనీతో అనుసంధానం చేసుకొని అడ్వాన్స్ ట్రేడ్ సెంటర్లుగా మారుస్తున్నామని అన్నారు.

200 కోట్ల రూపాయలను ఖర్చు చేసి 20 నుంచి 25 ఎకరాల స్థలంలో యంగ్ ఇండియా సమీకృత గురుకుల నిర్మాణ పనులు ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. మేడిపల్లి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేసుకున్నమని అన్నారు. వేదాలకు సంబంధించిన ఆల్ ఇండియా పరీక్షలు వేములవాడ రాజన్న ఆలయంలో జరగాయని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విద్యాసంస్థలను వేములవాడ ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామని అన్నారు.

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ నాగ పంచమి రోజు పీఎం ఉష పథకం క్రింద 9 కోట్ల 20 లక్షల రూపాయలతో అగ్రహారం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద బాలికల వద్ద గృహ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. 18 నెలల కాలంలో ఈ భవన నిర్మాణ పనులు పూర్తి చేసి విద్యార్థినులకు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు స్థానిక నాయకులు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## గంగాధర క్షేత్రంలో సామూహిక కుంకుమ పూజలు

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని గంగాధర క్షేత్రంలో శ్రావణమాసం పురస్కరించుకొని సామూహిక కుంకుమ పూజలను నిర్వహించారు . ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి కుంకుమ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. నాగుల పంచమి సందర్భంగా గంగాధర క్షేత్రంలో మహిళలు ఉదయాన్నే వచ్చి నాగదేవతలకు పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు నాగరాజు శర్మ, నాగలింగం పంతులు, మహిళ మూర్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి.. వాటిని సంరక్షించాలి..





- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, వేములవాడ:**

వాతావరణ సమతుల్యత.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని.. వాటిని సంరక్షించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వన మహోత్సవాన్ని వేములవాడ శ్రీ రాజ రాజేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాలలో మంగళవారం నిర్వహించగా, ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు ఈ సందర్భంగా గోశాల ఆవరణలో కదంబ, ఇతర మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాను రాను అడవుల విస్తీర్ణం తగ్గుతుండడంతో వాతావరణ కాలుష్యం పెరుగుతుందని, ఆక్సిజన్, పర్యావరణ ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తమ తమ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. గ్రామాల్లో.. పట్టణాల్లోని ఖాళీ స్థలాల్లో పండ్ల, పూల మొక్కలు నాటాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం.. సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ రాజన్న ఆలయం, నియోజకవర్గం, పట్టణ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని, భారీగా నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు. తిప్పాపూర్ గోశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నారని. రాష్ట్రంలో నాలుగు ఆధునాతన పద్ధతిల విశాలమైన గోశాలల నిర్మాణానికి సీఎం అధ్యక్షతన కేబినెట్ ఆమోదించిందని అన్నారు. వేములవాడ ఆలయానికి సంబంధించి కూడా ఆధునాతన వసతులతో గోశాల పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని దీనికి సంబంధించి స్థలం కూడా గుర్తించామనిఅన్నారు. వన మహోత్సవంలో భాగంగా అటవీ శాఖ, ఇతర శాఖల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతుందని పౌరులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### ఐ.ఎస్.ఓ సర్టిఫికేషన్ కోసం కృషి: కలెక్టర్

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాలకు ఐఎస్ఓ సర్టిఫికెట్ వచ్చేలా కృషి చేస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. తిప్పాపూర్ గోశాల ఆవరణలో సివిల్ వర్క్స్ కొనసాగుతున్నాయని వాటిని విప్ తో కలిసి పరిశీలించామని తెలిపారు. కోడెలకు పచ్చి గడ్డి సరఫరాలో ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నామని అన్నారు. మర్రిపల్లిలో 40 ఎకరాలు, నాంపల్లిలో 20 ఎకరాల ప్రభుత్వ భూమిలో పచ్చి గడ్డి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పెంచేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టామని అన్నారు. మూడు నెలల్లో పచ్చి గడ్డి అందుబాటులోకి రానుందని వెల్లడించారు. కోడెలకు అవసరమైన పచ్చిగడ్డి ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని కాంట్రాక్టర్లపై ఆధారపడే ఇబ్బంది ఉండదని ఈ విషయంలో స్వయం సమృద్ధి సాధించామని అన్నారు. మొరాదాబాద్ లోని గోశాలకు ఐఎస్ఓ సర్టిఫికెట్ వచ్చిందని, తిప్పాపూర్ గోశాల కూడా ఐఎస్ఓ సర్టిఫికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వనమహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఇంచార్జి ఈవో రాధాబాయి మున్సిపల్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సినారే జయంతి వేడుకలు.. ఘనంగా నివాళులు..

**బలగం టీవీ, వేములవాడ అర్బన్**

తెలుగు భాషా ఔన్నత్యాన్ని విశ్వవ్యాప్తం చేసిన సాహితీవేత్త, తెలుగు భాషా వికాసానికి విశేష కృషి చేసిన ఆదర్శమూర్తి, తెలంగాణ జాతికి గర్వకారణం, తెలుగు కవిత్వానికి కీర్తితోరణం, కవి, రచయిత, విద్యావేత్త, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, తెలుగు సాహితీ దిగ్గజం స్వర్గీయ డా. సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె) జయంతిని పురస్కరించుకుని ఈరోజు వేములవాడ అర్బన్ మండలం కమాన్ వద్దగల అఖిల భారత రెడ్డి సంఘం భవనంలో ప్రతిష్టించిన సినారె విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, రెడ్డి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల నాగిరెడ్డి, వేములవాడ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణ రెడ్డి, అఖిల భారత రెడ్డి సంఘం వేములవాడ కన్వీనర్ వెంకట్ రెడ్డి, విశ్వ హిందూ పరిషత్ నాయకులు రాధాకృష్ణ రెడ్డి, బీజేపీ నాయకులు ఏరెడ్డి రాజిరెడ్డి, జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీధర్ రెడ్డి, తీపిరెడ్డి కరుణాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సినారే జయంతి వేడుకలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లా సంఘం ఆధ్వర్యంలో కవి, రచయిత జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి. నారాయణ రెడ్డి 94వ జయంతి సందర్భంగా సిరిసిల్ల జిల్లా కవులు పుష్పాంజలి ఘటించడం జరిగినది. సిరిసిల్ల రచయితల సంఘం అధ్యక్షులు ఎలగొండ రవి మాట్లాడుతూ.. హనుమాజీపేట లో జన్మించి, సాహిత్య పూలతోటలో విరబూసి ఆలిండియాకే గర్వకారణం తెచ్చిన సిరిసిల్ల ముద్దుబిడ్డ సినారె జ్ఞానపీఠం పురస్కారం తెచ్చిన మహాకవి అని తెలిపారు. అలాగే రచయితల సంఘం ఉపాధ్యక్షులు బూర దేవానందం సి.నారాయణ రెడ్డి పై కవిత గానం చేశారు. ఉపాధ్యక్షులు వెంగళ లక్ష్మణ్ మాట్లాడుతూ సినారే సిరిసిల్లలో రాబోయే నూతన కవులకు ఒక దిక్సూచి అని తెలిపారు. అంతేకాకుండా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ మాట్లాడుతూ సినారే సిరిసిల్లలో జన్మించడం మా సిరిసిల్ల కే గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు ఎలాగొండ రవి, బుర దేవానందం, వెంగళ లక్ష్మణ్, చిటికెన కిరణ్ కుమార్, ఆడెపు లక్ష్మణ్, అంకారపు రవి, గుండెల్లి వంశీ, అల్లె రమేష్ కవులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.




# గోవాలో నైంటీస్ స్టార్స్ రీయూనియన్

## సీనియర్ నటీమణుల సందడి

బలగం టీవీ, హైదరాబాద్

ప్రతి ఏడాది 1990లలో ప్రఖ్యాతి గాంచిన సినీ తారలు కలిసి నిర్వహించే "నైంటీస్ రీయూనియన్" కార్యక్రమానికి ఈసారి గోవా వేదికైంది. ఈ వేడుకకు దక్షిణాది చలనచిత్ర పరిశ్రమలోని ప్రముఖ నటి-నటులు, దర్శకులు, టెక్నీషియన్లు హాజరై జయ్‌ఫుల్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలీవుడ్, కోలీవుడ్, టాలీవుడ్‌కు చెందిన ప్రముఖ హీరోయిన్లు సిమ్రాన్, సంగీత, సంఘవి, శ్వేతా మీనన్, మీనా, రీమా సేన్, మహేశ్వరి తదితరులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వైట్ అండ్ వైట్ డ్రెస్సుల్లో ముస్తాబై మెరిసిపోయిన వారంతా పార్టీ వాతావరణానికి కొత్త ఊపునిచ్చారు. ఇక స్టార్ డైరెక్టర్లు శంకర్, కె.ఎస్. రవికుమార్, లింగుసామి, ప్రభుదేవా, మోహన్ రాజా కూడా ఈ వేడుకకు హాజరై తమ కాలేజీ రోజుల స్నేహాన్ని గుర్తు చేసుకున్నారు. తెలుగు సినీ పరిశ్రమ నుంచి శ్రీకాంత్, జగపతి బాబు వంటి సీనియర్ హీరోలు హాజరై ఈ సమావేశానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గతాన్ని తలుచుకుంటూ, స్నేహబంధాలను మరింత బలపరుచుకుంటూ ముగిసిన ఈ వేడుక ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



# రాజాసాబ్ నుంచి సంజూ బాబా లుక్

బలగం టీవీ, హైదరాబాద్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం 'రాజాసాబ్' డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. టాలీవుడ్ డైరెక్టర్ మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా హారర్-కామెడీ నేపథ్యంలో రూపొందుతోంది. ఈ చిత్రంలో మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్, 'ఇస్మార్ట్ శంకర్' ఫేమ్ నిధి అగర్వాల్ కథానాయికలుగా నటిస్తున్నారు. మొదట విడుదల తేదీకి పలుమార్లు మార్పులు వచ్చినప్పటికీ, చివరకు డిసెంబర్ 5న రిలీజ్‌కు లాక్ చేసినట్లు మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. ఇదిలా ఉండగా, ప్రమోషన్స్‌లో భాగంగా బాలీవుడ్ సీనియర్ హీరో సంజయ్ దత్ లుక్‌ను విడుదల చేశారు. విలక్షణ గెటప్‌లో సంజయ్ దత్ కనిపించిన ఈ పోస్టర్‌కు మంచి స్పందన లభిస్తోంది. ప్రభాస్‌తో కలిసి ఆయన ఓ కీలక పాత్రలో కనిపించనున్నారని సమాచారం. ప్రస్తుతం సినిమా షూటింగ్ పూర్తి దశలో ఉండగా, గ్రాఫిక్స్ వర్క్‌కు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. యువీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రభాస్ అభిమానులతో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఆకట్టుకునేలా అన్ని హంగులతో సిద్ధమవుతోంది.

# 'సతీ లీలావతి' టీజర్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్


నటి లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'సతీ లీలావతి' టీజర్‌ను మేకర్స్ మంగళవారం విడుదల చేశారు. ఫన్ అండ్ ఎమోషన్స్ కలగలసిన ఈ టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. తాతినేని సత్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మలయాళ యాక్టర్ దేవ్ మోహన్ హీరోగా నటిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య జరిగే చిన్నచిన్న సంఘటనలను హాస్యమయం గానూ, హృద్యంగా గానూ తెరకెక్కించినట్లు టీజర్ చూస్తే స్పష్టమవుతోంది.

టీజర్‌లో లావణ్య-దేవ్ మధ్య వచ్చే మాటల తూటాలు, హాస్య సన్నివేశాలు వినోదాన్ని పంచుతున్నాయి. సోషల్ మీడియా ట్రెండ్‌లు, పెళ్లైన తర్వాత జీవితంలో వచ్చే మార్పులు, పెళ్లి అనుబంధంలోని విభిన్న కోణాలు ఇవన్నీ సరదాగా టీజర్‌లో చూపించారు. టీజర్ చివర్లో లావణ్య అభినయించిన ఎమోషనల్ సన్నివేశం ఆమె నటి ప్రతిభను మరోసారి నెరపించింది. వివాహం అనంతరం వరుణ్ తేజ్ తర్వాత లావణ్య నటించిన తొలి చిత్రం ఇదే కావడం విశేషం. ఈ చిత్రంలో నరేశ్, సప్తగిరి, వి.టి.వి. గణేశ్, జాఫర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగ మోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమాను త్వరలోనే విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. త్వరలో విడుదల తేదీని వెల్లడించనున్నారు.




# ఉస్తాద్ భగత్‌సింగ్' క్లైమాక్స్ షూటింగ్ పూర్తి

బలగం టీవీ, హైదరాబాద్




పవర్‌స్టార్ పవన్ కల్యాణ్, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. ప్రస్తుతం ఈ మూవీ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. తాజాగా ఈ సినిమా షూటింగ్‌పై నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ కీలక అప్డేట్ ఇచ్చింది. మూవీ క్లైమాక్స్ షఉటింగ్ పూర్తి అయినట్లు తెలిపింది. ఈ మేరకు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పోస్టు పెట్టింది. " 'ఉస్తాద్ భగత్‌సింగ్' క్లైమాక్స్ షూటింగ్ పూర్తి చేసుకుంది. భావోద్వేగాలు, యాక్షన్‌తో కూడిన అద్భుతమైన క్లైమాక్స్. నబకాంత్ మాస్టర్ పర్యవేక్షణలో షూటింగ్ ముగిసింది. ఏపీ డిప్యూటీ సీఎంగా క్యాబినెట్ సమావేశాలు, బాధ్యతలు ఉన్నప్పటికీ, హరిహర వీరమల్లు ప్రమోషన్లలో పాల్గొన్నప్పటికీ, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ షూటింగ్‌ను వేగంగా పూర్తి చేశారు. ఇది ఆయన అంకితభావం, కష్టపడి పనిచేసే స్వభావానికి నిదర్శనం" అంటూ నిర్మాణ సంస్థ ట్వీట్ చేసింది.

# 'మహావతార్ నరసింహ'పై ప్రభాస్ ప్రశంసలు

బలగం టీవీ, హైదరాబాద్

3డీ యానిమేటెడ్ చిత్రం 'మహావతార్ నరసింహ'. ప్రముఖ నిర్మాత మెయ్యప్పన్ నిర్మించిన 50 ఏళ్ల నాటి క్లాసిక్ భక్త ప్రహ్లాదకు ఆధునిక రూపం. పురాణాలను ఆధునిక విజువల్స్‌తో మిళితం చేసిన ఈ చిత్రం, మహా విష్ణువు దశావతారాల నేపథ్యంలో రూపొందిన 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్' ప్రారంభంగా నిలిచింది. ఇటీవల ఈ చిత్రాన్ని వీక్షించిన నటుడు ప్రభాస్, "హెూంబలే ఫిల్మ్ పవర్‌ఫుల్ విజన్‌తో ప్రేక్షకుల ముందుకు ఈ చిత్రాన్ని తీసుకువచ్చింది. యాక్షన్ సన్నివేశాలు, యానిమేషన్ దృశ్యాలు అద్భుతం గా ఉన్నాయి. దర్శకుడు అశ్విన్ కుమార్, చిత్రబృందానికి నా హృదయ పూర్వక అభినందనలు" అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. ప్రభాస్ స్పందనపై హెూంబలే చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా కృతజ్ఞతలు తెలిపింది.




# కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు భారీ షాక్

- **హెడ్‌కోచ్ చంద్రకాంత్ పండిట్ రాజీనామా**

బలగం టీవీ, హైదరాబాద్



ఐపీఎల్ ఫ్రాంఛైజీ కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్)కు భారీ షాక్ తగిలింది. గత మూడు సీజన్లుగా హెడ్ కోచ్‌గా సేవలందించిన చంద్రకాంత్ పండిట్ మంగళవారం హఠాత్తుగా తన పదవికి రాజీనామా చేశారు. కోచ్‌గా విజయవంతంగా సేవలందించిన చంద్రకాంత్ నిర్ణయాన్ని గౌరవిస్తూ ఫ్రాంఛైజీ యాజమాన్యం కూడా రాజీనామా ఆమోదించింది. చంద్రకాంత్ పండిట్‌ను వీడ్కోలు చేస్తూ, కోల్‌కతా యాజమాన్యం సోషల్ మీడియా వేదికగా ఎక్స్ పోస్ట్ చేసింది. "ఈ మూడేళ్లలో మీరు అందించిన సేవలకు ధన్యవాదాలు చందు సర్. మీ క్రమశిక్షణ, నాయకత్వం జట్టును మరింత బలోపేతం చేసింది. మూడోసారి ఐపీఎల్ ట్రోఫీ అందించడంలో మీ పాత్ర అపూర్వం. మీ భవిష్యత్‌కు ఆల్ ది బెస్ట్" అని పేర్కొంది.

అయితే చంద్రకాంత్ వైదొలగడంపై అనేక ఊహాగానాలు చర్చనీయాంశమయ్యాయి. ఇటీవలే అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ డబ్ల్యూపీఎల్ ఫ్రాంఛైజీ యూపీ వారియర్స్ ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో, చంద్రకాంత్ కూడా వుమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో ఓ జట్టుకు కోచ్‌గా అవకాశం పొందే యోచనలో ఉన్నారా? అన్నది ఆసక్తికరంగా మారింది. భారత మాజీ వికెట్ కీపర్ అయిన చంద్రకాంత్ పండిట్, 2022లో బ్రెండన్ మెక్‌కల్లమ్ స్థానాన్ని భర్తీ చేస్తూ కేకేఆర్ హెడ్ కోచ్‌గా నియమితులయ్యారు. తొలి ఏడాది నుంచే మంచి ఫలితాలు ఇచ్చిన ఆయన, 17వ సీజన్‌లో కేకేఆర్‌ను చాంపియన్‌గా నిలిపారు. మెంటార్ గౌతమ్ గంభీర్ మద్దతుతో జట్టును నూతన శక్తితో తీర్చిదిద్దిన చంద్రకాంత్, మొత్తం 42 మ్యాచ్‌లలో 22 విజయాలు సాధించడంలో కీలకపాత్ర పోషించారు.

# పాక్‌తో క్రికెట్ ఎలా ఆడతారు?'

- **ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ**

బలగం టీవీ, హైదరాబాద్



ఇండియా-పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌లకు ఎంత క్రేజ్ ఉంటుందో అందరికీ తెలిసిందే. తాజాగా ఆసియా కప్-2025 షెడ్యూల్ విడుదల కావడంతో భారత్, పాకిస్థాన్ జట్లు సెప్టెంబర్ 14న దుబాయ్ వేదికగా తలపడనున్నట్లు ఖరారైంది. ఇదే అంశంపై ఎంఐఎం పార్టీ లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఓవైసీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభలో "ఆపరేషన్ సిందూర్"పై చర్చ సందర్భంగా మాట్లాడిన ఓవైసీ, భారత్-పాకిస్థాన్ మధ్య క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించడం సబబేనా అని ప్రశ్నించారు. "పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాకిస్థాన్ సంబంధాలు మరింత బలహీనంగా మారాయి. అటువంటి సమయంలో పాక్‌తో క్రికెట్ ఎలా ఆడతారు?" అని సూటిగా నిలదీశారు. "పాకిస్థాన్ విమానాలు మన వైమానిక క్షేత్రంలోకి రావడం లేదు. బోటులు మన జలాల్లోకి రావడం లేదు. వాణిజ్యం జరగడం లేదు. మనం వాళ్లకు నీళ్లు ఇవ్వడం లేదు. రక్తం, నీరు ఒకేసారి పారవని అంటున్నాం. అలాంటప్పుడు ఆ దేశంతో క్రికెట్ ఆడటం ఎలా సమంజసం?" అని ఆయన ప్రశ్నించారు.

సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ప్రారంభం కానుంది. మొత్తం 8 జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి. భారత్, పాకిస్థాన్ మ్యాచ్ అయితే ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. అయితే, దేశంలోని కొన్ని రాజకీయ నేతలు ఈ మ్యాచ్‌ల నిర్వహణపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

# ఓవల్ మైదానంలో సిబ్బందితో గంభీర్ ఘర్షణ..!

బలగం టీవీ, హైదరాబాద్



ఇండియా-ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ చివరి టెస్ట్ మ్యాచ్‌కు కేవలం రెండు రోజుల ముందే లండన్‌లోని ఓవల్ మైదానంలోవివాదం చోటుచేసుకుందని సమాచారం. భారత జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మైదానం సిబ్బందితో తీవ్ర వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ఈ సంఘటన సిరీస్ కీలక మ్యాచుకు ముందు వాతావరణాన్ని మరింత వేడెక్కించింది.

**శిక్షణ సౌకర్యాలపై అసంతృప్తి**

మాంచెస్టర్‌లో నాలుగో టెస్ట్ అనంతరం టీం ఇండియా సోమవారం లండన్‌కు చేరుకుంది. మంగళవారం ఓవల్ మైదానంలో ప్రాక్టీస్ షెడ్యూల్ చేసుకుంది. అయితే జట్టు కోసం కేటాయించిన శిక్షణ సౌకర్యాలు తక్కువస్థాయిలో ఉండటంతో గంభీర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ అసంతృప్తి వాగ్వాదానికి దారితీసింది. సమాచారం మేరకు గంభీర్ మైదాన సిబ్బందిపై గట్టిగా స్పందించినట్లు తెలిసింది. ఈ సమయంలో బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ సహా ఇతర సహాయక సిబ్బంది మధ్యవర్తులుగా జోక్యం చేసుకొని పరిస్థితిని శాంతపరిచేందుకు ప్రయత్నించారు. అయితే ఓవల్ మైదాన సిబ్బంది.. గంభీర్‌పై అధికారికంగా ఫిర్యాదు చేస్తామని హెచ్చరించినట్లు వార్తలు వస్తున్నాయి. ?? గంభీర్ కూడా వెనక్కి తగ్గకుండా.. "ఎవరికి కావాలంటే వారికి ఫిర్యాదు చేయండి, కానీ మా పని మీరు నిలిపివేయలేరు" అని ఘాటుగా సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఇంగ్లండ్ జట్టు 5 టెస్టుల సిరీస్‌ను 2-1తో ఆధిక్యంలో కొనసాగిస్తుండగా, ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో నాలుగో టెస్ట్ డ్రాగా ముగిసింది. గురువారం ప్రారంభమయ్యే ఓవల్ టెస్టో భారత్ సమం చేయాలని భావిస్తుండగా.. ఇప్పుడు ఈ వివాదం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.